లయన్ కొట్లూరి వేణుగోపాల్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) మాతృమూర్తి కొట్లూరి లక్ష్మమ్మ దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీ3 న్యూస్ చానల్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణ, శర్మ, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దాము మహేందర్ యాదవ్.

- విశ్వంభర, నల్గొండ

మరింత తీవ్రంగా ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం

- హైఫా, బీర్‌షిబా, టెల్ అవీవ్‌లపై ఇరాన్ క్షిపణులు
- ఇరాన్‌పైకి దూసుకెళ్లిన 60 యుద్ధ విమానాలు
- ఆ దేశ రక్షణ పరిశోధన కేంద్రం ధ్వంసం

విశ్వంభర, నేషనల్ బ్యూరో : అటు ఇజ్రాయెలూ తగ్గడం లేదు. ఇటు ఇరానూ వెనుకడుగు వేయడం లేదు. సై అంటే సై అంటున్నాయి. యుద్ధం ఎనిమిదో రోజైన శుక్రవారం పరస్పర దాడుల తీవ్రతను మరింత పెంచాయి. ఒకవైపు యుద్ధం ఆపడానికి జెనీవాలో చర్చల ప్రక్రియ ప్రారంభమైనా.. రెండు దేశాలు బాంబుల వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాయి. టెల్ అవీవ్, హైఫా, బీర్‌షిబా నగరాలపై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ముఖ్యంగా బీర్‌షిబా లోని టెక్నాలజీ పార్కుపై దాడి చేసింది. ఈ ఘటనలో పలు భవనాలకు నష్టం వాటిల్లింది. మైక్రోసాఫ్ట్ కార్యాలయం సమీపంలో మంటలు ఎగసిపడ్డాయి. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన కీలక కార్యాలయాలు ఆ పార్కులో ఉన్నట్లు తెలుస్తోంది. హైఫా నగరంపై ఇరాన్ చేసిన మిసైల్ దాడిలో 23 మందికి గాయాలయ్యాయి. మరోవైపు రాజధాని టెహ్రాన్, ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై 60కు పైగా యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ రక్షణ పరిశోధనా సంస్థ కేంద్ర కార్యాలయానికీ నష్టం కలిగించింది. పశ్చిమ ఇరాన్‌లోని కెర్మన్‌షా, తబ్రీజ్ ప్రాంతాలలో ఉన్న బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేసింది. కాస్పియన్ సముద్రం సమీపంలో ఉన్న రాస్ట్ నగరంపైనా బాంబులు వేసింది.

ఐరోపా నేతలతో భేటీ: ఇరాన్‌పై దాడి చేయాలా లేదా అనే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం పేర్కొన్న నేపథ్యంలో ఐరోపా నేతలతో సమావేశం అవ్వడానికి ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం జెనీవా చేరుకున్నారు. అక్కడ అనేక గంటలపాటు ఐరోపా, ఇరాన్ నేతల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్ని మరింతగా కొనసాగించాలని ఐరోపా నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టంగా చెప్పినట్లు బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లామీ తెలిపారు. అంతకుముందు అబ్బాస్ అరాగ్చీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ దాడులు ఆపనంతవరకు అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ''చర్చలు జరపాలని అమెరికన్లు కోరుకుంటున్నారు. చాలా సందేశాలు పంపారు. దాడులు ఆపనంతవరకు చర్చల ప్రసక్తే లేదని వారికి స్పష్టం చేశాం'' అని చెప్పారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా టెహ్రాన్, బీరుట్, బాగ్దాద్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి.

ఇజ్రాయెల్ దాడుల్లో అరాక్ నగరంలో నిర్మాణంలో ఉన్న అణుకేంద్రానికి భారీగా నష్టం వాటిల్లిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. కీలక భవనాలు దెబ్బతిన్నాయని పేర్కొంది. ఇజ్రాయెలీ యుద్ధ విమానాలు గురువారం అరాక్ భార జల రియాక్టర్‌పై బాంబుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.

భద్రకాళి అమ్మవారి బోనాలు వాయిదా: మంత్రి సురేఖ

విశ్వంభర, వరంగల్ : వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అసాంఘిక శక్తులను ప్రేరేపించి కొందరు గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు మంత్రి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఆగమశాస్త్రం ప్రకారం, వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22న బోనాలు నిర్వహించాలని అనుకున్నాం. అయితే, మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తున్నట్లు కొందరు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయి. శాకాహార బోనాలే ఉంటాయన్న విషయాన్ని ప్రభుత్వం, స్థానిక ఈవో, వేదపండితులు పలుమార్లు పునరుద్ఘాటించారు. స్థానిక రాజకీయ వైషమ్యాలను కొందరు పవిత్ర కార్యానికి ముడిపెట్టి ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు సృష్టిస్తారేమోనన్న అనుమానాలున్నాయి. అందుకే బోనాలను తాత్కాలికంగా నిలిపేశాం. తగిన సమయంలో వైభవంగా నిర్వహిస్తాం'' అని స్పష్టం చేశారు. సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి సురేఖ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డిలపై విమర్శలు చేశారు.

''గోదావరి పుష్కరాల నిర్వహణకు తెలంగాణకు రూ.200 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశాం. నిధుల విషయమై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ చూపాలి'' అని మంత్రి సురేఖ కోరారు. అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి నుంచి 18 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ, వైద్య సహాయం కోసం రూ.32 లక్షల చెక్కును దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల కోసం పోరాటం చేసిన బహుజన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

విశ్వంభర, ఎల్బినగర్ : తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి, సబ్బండ వర్గాల కోసం పోరాటం చేసిన బహుజన నాయకుడని జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. ఎల్బీనగర్ లోని సిల్క్ టవర్ లో తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకై బొమ్మ రఘురాం నేత అధ్యక్షతన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంఘం ఉప అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం, బహుజనల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో మంత్రి పదవికీ రాజీనామా చేసి తెలంగాణ కోసం తన రాజకీయ భవిష్యత్తును త్యాగం చేసిన యోధుడని పేర్కొన్నారు. అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమంలో కూడా తనదైన పాత్రను పోషించి తెలంగాణ ఉద్యమకారులకు మద్దతు పలికాడు. సబ్బండ వర్గాల బలోపేతం కోసం బహుజనుల నాయకత్వాన్ని బలపరిచేందుకు ఎంతో పోరాటం చేశారని అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని ఈ సందర్భంగా తెలియజేశారు. వారి పోరాట పటిమకు గుర్తుగా ఎల్బీనగర్ చౌరస్తా లో బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ సంకల్పించిన తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక సభ్యులను ఆయన అభినందించారు. త్వరితగతిన కార్యాచరణ చేపట్టి విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీనికోసం స్పందించిన సమన్వయ వేదిక సభ్యులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఎల్బీనగర్ చౌరస్తాలో ఆగస్టులో ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ది జగదీశ్, రాపోలు జ్ఞానేశ్వర్, జెల్ల నరేందర్, డా. అవ్వారు వేణు, యాదగిరి, రాములు, రాము నేత తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థుల పాట విని.. పుట్టినరోజున రాష్ట్రపతి ముర్ము కంటతడి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ అంధ విద్యార్థులు ఆలపించిన గీతం విని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నారులు ''బార్‌బార్ దిన్ యే ఆయే.. తుమ్ జియో హజారో సాల్'' గీతాన్ని ఆలపిస్తుండగా ముర్ము కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన ఉత్తరాఖండ్ రాజధాని దేహ్రాదూన్‌లో జరిగింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆమె దేహ్రాదూన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడి అంధుల పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. శుక్రవారం ముర్ము 67వ పుట్టినరోజు కావడంతో ఆమె కోసం చిన్నారులు గీతాన్ని ఆలపించారు. దీంతో భావోద్వేగానికి గురైన ఆమె తర్వాత మాట్లాడుతూ.. తన ప్రజా జీవితంలో గుర్తుండిపోయే క్షణాల్లో ఇది ఒకటన్నారు. ''నేను కన్నీళ్లను ఆపుకోలేకపోయాను. వారు ఎంతో అందంగా పాడారు'' అని ముర్ము అన్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాష్ట్రపతి ముర్ము జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విశాఖ చేరుకున్న ప్రధాని

నేడు యోగాంధ్ర వేడుకల్లో పాల్గొననున్న మోడీ



విశ్వంభర, అమరావతి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విశాఖ విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. శనివారం విశాఖ వేదికగా జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా వేడుకల్లో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో ప్రధాని మోడీ భువనేశ్వర్ నుంచి ప్రత్యేకవిమానంలో విశాఖకు చేరుకున్నారు. ఆయన సాయంత్రం 6.40 గంటలకు రావాల్సి ఉండగా 50 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నారు. ఐఎన్ఎస్ డేగా వద్దకు చేరుకున్న ప్రధానమంత్రికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రతాప్‌రావ్ జాదవ్, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. ప్రధాని మోడీ అందరినీ భుజం తట్టి ఆప్యాయంగా పలకరించారు. యోగాంధ్ర ఏర్పాట్లు బాగున్నాయని అభినందించారు. నారా లోకేశ్‌తో కరచాలనం చేస్తూ మెడలోని యోగాంధ్ర ఐడీ కార్డును చూస్తూ భుజంపై చేయి వేసి మాట్లాడారు. స్వాగత కార్యక్రమాల తర్వాత సీఎం, డిప్యూటీ సీఎంలతో కలిసి ప్రధానమంత్రి విమానాశ్రయం నుంచి నేరుగా నౌకాదళ అతిథిగృహానికి వెళ్లారు. అక్కడ కొద్ది సేపు ప్రధాని, ముఖ్యమంత్రి చర్చించుకున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు రోడ్డుమార్గంలో 8:45 గంటలకు కలెక్టరేట్‌లోని రాత్రిబస కేంద్రానికి చేరుకున్నారు.

శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు వేర్వేరు విమానాల్లో విశాఖకు చేరుకున్నారు. వీరికి పార్టీనేతలు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఐఎన్ఎస్ డేగా వద్దకు సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు చేరుకొని ప్రధానమంత్రి కోసం వేచిచూశారు. ఐఎన్ఎస్ సర్కార్స్ చోళ సూట్‌లో ప్రధాని బస.. ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం రాత్రి ఈస్టర్న్ నేవల్ కమాండ్ ముఖ్య కార్యాలయం 'ఐఎన్ఎస్ సర్కార్స్'లోని చోళ సూట్‌లో బసచేశారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రధాని భద్రతా విభాగ ఆదేశాలతో పదిరోజుల క్రితమే ఈ కేంద్రాన్ని భద్రతాదళాలు తమ ఆధీనంలోకి తీసుకుని మూడంచెల భద్రతా వలయం ఏర్పాటుచేశాయి. శనివారం తెల్లవారుజామున ప్రధాని కమాండ్ మెస్ నుంచి బయలుదేరి ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు.

హెచ్ఐవీ వ్యాధిని అదుపు చేసే ఇంజెక్షన్

విశ్వంభర, స్పెషల్ బ్యూరోః

హెచ్ఐవీ వ్యాధిని అదుపు చేసే ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఇంజెక్షన్‌ను ఏడాదికి రెండుసార్లు తీసుకుంటే సరిపోతుంది. ఇప్పటి వరకు ఈ వ్యాధిని అదుపులో పెట్టడానికి రోజూ ట్యాబ్లెట్లు వేసుకోవాల్సి వస్తోంది. దీనికి బదులు ఇంజెక్షన్‌ను ఆవిష్కరించడం ఆసక్తికర పరిణామమని, ఈ వ్యాధి వ్యాప్తిని నిరోధించడానికి వీలుకలుగుతుందని ఔషధ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే ఏటా 13 లక్షల హెచ్ఐవీ కొత్త కేసులు నమోదవుతున్న విషయాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఈ వ్యాధిగ్రస్తుల కోసం లెనకాపవిర్ అనే ఔషధ ఇంజెక్షన్‌ను బహుళ జాతి ఔషధ సంస్థ గిలీడ్ సైన్సెస్ ఆవిష్కరించింది. దీన్ని యెజ్జుగో అనే బ్రాండుపై విక్రయించనుంది. హెచ్ఐవీ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందకుండా ఈ ఇంజెక్షన్ నిరోధిస్తుందని, పెద్దలు పిల్లలపై నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం నిర్ధారణ అయినట్లు గిలీడ్ సైన్సెస్ వెల్లడించింది. ఆఫ్రికా దేశాల్లో ఔషధ పరీక్షలు నిర్వహించగా 99.9% సమర్థత కనిపించినట్లు పేర్కొంది.

తక్కువ ధరకు ఉత్పత్తి చేసేందుకు యత్నాలు: లెనకాపవిర్ జనరిక్ ఇంజెక్షన్‌ను ఉత్పత్తి చేసి, తక్కువ ఆదాయాలు గల 120 దేశాల్లో విక్రయించటానికి గిలీడ్ సైన్సెస్ గత ఏడాదిలో 6 ఫార్మా కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ కంపెనీలు లెనకాపవిర్ జనరిక్ ఇంజెక్షన్ అందుబాటులోకి తీసుకురావడానికి కొంత సమయం పడుతుంది కాబట్టి, ఈ లోపు 20 లక్షల డోసుల ఇంజెక్షన్‌ను పంపిణీ చేయడానికి గిలీడ్ సైన్సెస్ సిద్ధమైంది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితికి చెందిన గ్లోబల్ ఫండ్, యూఎస్ ప్రభుత్వానికి చెందిన పెప్‌ఫార్ కార్యక్రమంతో ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ పెప్‌ఫార్ కార్యక్రమానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిధుల కేటాయింపు తగ్గించారు. దీంతో ఈ ఇంజెక్షన్‌ను కొనుగోలు చేసే వ్యవహారం పెండింగ్‌లో పడింది.

ఖరీదు ఎక్కువ, అదే అవరోధం..

ఈ ఇంజెక్షన్ ఖర్చే మింగుడుపడని అంశంగా ఉంది. అమెరికాలో ఒక వ్యక్తి, ఒక ఏడాదిలో రెండుసార్లు ఈ ఇంజెక్షన్ చేయించుకునేందుకు అయ్యే ఖర్చు 28,218 డాలర్లు (సుమారు రూ.24.40 లక్షలు) కావడం గమనార్హం. ఈ ఖర్చును అభివృద్ధి చెందిన దేశాల్లోని ప్రజలు కూడా భరించలేరనే ఆందోళన వ్యక్తమవుతోంది. మనదేశంలో ఈ ఇంజెక్షన్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో, దాని ధర ఎంత ఉంటుందో స్పష్టత లేదు.ఈ ఇంజెక్షన్ ధర తగ్గించేందుకు కసరత్తు చేస్తున్నట్లు గిలీడ్ సైన్సెస్ వెల్లడించింది.

న్యాయం మరింత చేరువ చేయడమే మా లక్ష్యం : సోమి రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : కోకాపేటలో శుక్రవారం సోమి రెడ్డి లా గ్రూప్ లో అమెరికా లోని భారత విద్యార్థుల ఇబ్బందులు, ఆటంకాలపైన చట్ట పరమైన పోరాటం గురించి నిర్వహించిన కార్యక్రమం లో ముఖ్య అతిథులు గా భువనగిరి ఎంపీ చమల కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఏఐసిసి జనరల్ సెక్రటరీ బోధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆఫ్ తెలంగాణ ప్లానింగ్ బోర్డు జి చెన్న రెడ్డి, టీపీసిసి సీనియర్ లీడర్ పొట్టిగారి నరసింహ రెడ్డి, అడ్వకేట్ జనరల్ తెలంగాణ స్టేట్ ఏ సుదర్శన్ రెడ్డి, ఐపిఎస్ ఎస్పీ ఇంటిలిజెన్స్ ముత్యం రెడ్డి పాల్గొన్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో న్యాయ సేవలను మరింత సులభ తరం చేసే ప్రయత్నం చేస్తున్నామని సోమి రెడ్డి లా గ్రూప్ వ్యవస్థాపకులు సోమిరెడ్డి సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. కోకాపేట లో శుక్రవారం తమ లా గ్రూప్ కొత్త కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తరువాత భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య లను సైతం తమ లా కంపెనీ పరిష్కరించిందని ఆయన చెప్పారు. అనేక దేశాల విద్యార్థుల ను వారి వారి దేశాలకు బలవంతంగా పంపించి వేస్తున్న డోనాల్డ్ ట్రంప్ అన్యాయపు తీరును అమెరికా ఫెడరల్ కోర్టులో సవాల్ చేసి అనుకూల తీర్పు వచ్చేలా తమలా కంపెనీ పని చేసిందని చెప్పారు. తమ న్యాయ పోరాట ఫలితంగా తరువాతి కాలంలో ఒక్క భారతీయ విద్యార్థి ని కూడా వెనక్కి పంపించ లేక పోయారని ఆయన తెలిపారు. ఇది తమ లా కంపెనీ సాధించిన మంచి విజయాల్లో ఒకటి అని ఆయన చెప్పారు. కక్షిదారులకు సులభ తరమైన న్యాయ సేవలు అందించే లక్ష్యంతో కోకా పేటలో తమ కార్యాలయం లో పరిష్కారాలు చేస్తాము అని అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ కార్యాలయం కార్పొరేట్, రియల్ ఎస్టేట్, కుటుంబ వివాదాలు, సివిల్, క్రిమినల్ వివాదాలకు సంబందించిన సేవల ను అందిస్తున్నాం అన్నారు. పూర్తి వృత్తి పరమైన విలువలు సూత్రాలను పాటిస్తూ సేవలను అందించే విధంగా కార్యాలయాన్ని రూపొందించామని సోమిరెడ్డి సంతోష్ రెడ్డి మరియు ఎల్లారెడ్డిగారి విజయ్ తెలిపారు.

కక్షిదారుల గోప్యతను కాపాడుతూ న్యాయ సేవలను నిజాయితీగా అందించే ప్రయత్నాలను చేస్తామని చెప్పారు. హైదరాబాద్ లో ఇప్పటి వరకు ఇలాంటి ఆధునిక న్యాయ కార్యాలయం లేదని, ఆ లోటును పూడ్చిన ఘనత తమదేనని ఆయన ప్రకటించారు. అన్ని రకాల న్యాయ వివాదాలను స్వీకరించి కక్షిదారులకు న్యాయ సేవలను అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అన్ని సౌకర్యాలతో కూడిన న్యాయ వాదుల కార్యాలయం హైదరాబాద్ లో ఏర్పడడం శుభ పరిణామని పేర్కొన్నారు.

కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్ ఎన్జీఓ వారి "ట్వింకిల్ టోట్స్ ప్రీ ప్రైమరీ స్కూల్" ప్రారంభం

విశ్వంభర, హైదరాబాద్ : "ట్వింకిల్ టోట్స్ ప్రీ ప్రైమరీ స్కూల్" ప్రారంభోత్సవంకి ముఖ్య అతిథి శ్రీమతి సుమ కనకాల , ప్రముఖ భారతీయ టెలివిజన్ ప్రజెంటర్ , నటి మరియు నిర్మాత & సునీతా శేఖర్ యాదవ్ , కార్పొరేటర్ మౌలాలి డివిజన్ , గౌరవ అతిథి గా పాల్గొన్నారు. ఇ సుకుమారన్, ప్రెసిడెంట్ కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ హైదరాబాద్, కల్నల్ పి సుందరేశ్వరన్ (రిటైర్డ్), సెక్రటరీ, అకడమిక్ కౌన్సిల్ చైర్మన్ పికె కృష్ణన్ ఆర్గనైజింగ్ కమిటీ వారు పాల్గొన్నారు. కైరలీ ఎడ్యుకేషన్ సొసైటీ 1993లో స్థాపించబడిన లాభాపేక్ష లేని ఎన్జీఓ చదువు కోసం డబ్బు ఖర్చు చేయలేని పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో విద్యను అందించడం కోసం మా సంస్థ స్థాపించబడింది మరియు ఇప్పటికే నేరేడ్‌మెట్‌లో కైరలీ విద్యాభవన్‌ను నడుపుతోంది, ఇది ప్రముఖ మాంటిస్సోరి విద్యావేత్త అయిన క్రీడోతో జతకట్టబడిన ప్రీప్రైమరీ స్కూల్ "ట్వింకిల్ టోట్స్"ని ప్రారంభించడం గర్వంగా ఉంది. ఏ ఎస్ రావు నగర్ లోని వెంకటేశ్వర నగర్ కాలనీలో ఉన్న ఈ పాఠశాల అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించడానికి అంకితం చేయబడింది. విద్యారంగంపై సానుకూల ప్రభావం చూపాలని సొసైటీ లక్ష్యంగా పెట్టుకుంది మరియు ఈ లక్ష్యాన్ని సాధించడంలో "ట్వింకిల్ టోట్స్" ఒక ముఖ్యమైన అడుగు. "ట్వింకిల్ టోట్స్"లో మేము కొత్త జాతీయ విద్యా విధానం(NEP)ని అమలు చేయడానికి కట్టుబడి ఉన్నాము మరియు యువ అభ్యాసకులు ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని అందించాము. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాఠశాల ఈ ప్రాంతంలో నాణ్యమైన విద్యకు కేంద్రంగా మార్చడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి

వందలది నిరుద్యోగుల ధర్నా

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలనీ, జాబు క్యాలెండర్ ప్రకటించాలని డీఎస్సీ నోటిఫికేషన్ జారి చేసి 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలనీ డిమాండ్ చేస్తూ వేలాది మంది నిరుద్యోగులు శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద భారి ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గత 18 నెలల కాలంలో 60వేల ఉద్యోగాలు కుడా భర్తీ చేయలేదని ద్వజమేత్తరు. ఇంకా అనేక ప్రభుత్వ శాఖలలలో పెద్ద ఎత్తున ఖాళీలను భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం జూన్ 2న తెలంగాణా ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా జాబ్ క్యాలెండరు ప్రకటిస్తున్నామంటే నిరుద్యోగులంత ఎదురు చూశారు. కాని ప్రకటించ లేదు .ఇప్పటి కైనా వెంటనే ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రేవంత్ ముఖమంత్రి కావడానికి నిరుద్యోగులు కారణమని వీరిని విస్మరించడం తగదని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని కొందరు అధికారాలు ఖాళీలు లెక్కించే విషయంలో తప్పుతోవ పట్టిస్తు, అధికారులు తప్పుడు విధానాలను అవలంబిస్తున్నరని విమర్శించారు. ఎంత మంది రిటైర్ అయ్యారు. ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారు. కొత్త జిల్లాలు ఆఫీసులు రావడం వలన ఎన్ని ఉద్యోగాలు సృష్టించారని అంశాలను దృష్టిలో పెట్టుకోకుండా ఖాళీలు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ప్రత్యక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రైవేటు రంగం ఐ టీ. తదిదర ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ శాఖలలో అన్ని శాఖలలో ముఖ్యంగా విద్య, వైద్యం, రెవిన్యూ. పంచాయత్ రాజ్య శాక ఉద్యోగాలను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలనీ కోరారు.రాష్ట్రంలో 7 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ 23 జిల్లాలోని వాటిలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, అలాగే పెద్ద యెత్తున తాలూకా ఆఫీసులు ఏర్పడ్డాయి. అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజినల్ ఆఫీసులు, 76 మున్సిపాలిటిలు, 7 మున్సిపల్ కార్పోరేషన్లు, 25 DSP ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీస్ కమిషనరేట్లు, 4,383 గ్రామపంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఇందులో గ్రూప్1, గ్రూప్2, గ్రూప్4 సర్వీస్ పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు చేయలేదు. వీటికి పోస్టులు వెంటనే మంజూరు చేయాలి. వీటికి అన్ని స్థాయిలలో పోస్టులు మంజూరు చేస్తే దాదాపు లక్ష పోస్టు అధనంగ వస్తాయి. ఇందులో డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా లెక్కించాలి. వాటిలో గ్రూప్I 50 శాతం, గ్రూప్2 లో 30 నుంచి 40 శాతం గ్రూప్ IV తదితర పోస్టులు 100 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటా కింద ఎన్ని పోస్టులు వస్తాయో పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలి..ఒకే దఫా గ్రూప్ 1234 మరియు టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తున్నందున మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులంన్నింటికీ సెలెక్ట్ అవుతారు. ఒక అభ్యర్థి అన్ని రకాల 6 7 కేటగిరీల పోస్టులకు ఒకేసారి సెలెక్ట్ అయితే ఆ అభ్యర్థి ఒకే పోస్టుల ఎంపిక చేసుకుంటారు. మిగతా 5 6 రకాల పోస్టులు మిగిలిపోతా